సాక్షి
నిజామాబాద్
సోమవారం, 30, జూన్, 2025



అధ్వానంగా టూరిజం..

టూరిజం స్పాట్‌గా మారిన ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది.

- 8లో ▸



భీమ్‌గల్‌కు కోర్టు..

భీమ్‌గల్ కేంద్రంగా జూనియర్ సివిల్ జడ్జి కమ్ ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ కోర్టు ప్రారంభం కానుంది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.7 /24.3

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా బల్మూరి



నిజామాబాద్‌అర్బన్: కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జీలను నియమించింది. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను ఎంపిక చేసింది. అలాగే పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి సెక్రటరీలుగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, నరేశ్ జాదవ్, రాజురెడ్డిలను నియమించింది.

కట్టుదిట్టమైన భద్రత



ఖలీల్‌వాడి: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యటన ముగిసింది. భద్రత చర్యల్లో భాగంగా నగరంలోని 10 కిలోమీటర్ల పరిధిని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కలెక్టరేట్, పసుపు బోర్డు కార్యాలయం, డీఎస్ విగ్రహం, పాలిటెక్నిక్‌లోని రైతు సమ్మేళన సభా ప్రాంగణాల వద్ద అడుగడుగునా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అమిత్ షా పర్యటించే ప్రాంతాల్లో బైనాక్యులర్‌ల తోపాటు సీసీ, డ్రోన్ కెమెరాలతో పోలీసులు పహారా కాశారు. బందోబస్తును సీపీ పోతరాజు సాయిచైతన్య ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. బందోబస్తుకు సహకరించిన భద్రతా విభాగం ఉన్నతాధికారులు, కలెక్టర్, అధికారులు, ప్రజలకు సీపీ కృతజ్ఞతలు తెలిపారు.


భారత మహిళల బాక్సింగ్ కోచ్‌గా ఎత్తెసామొద్దీన్



నిజామాబాద్‌నాగారం: భారత మహిళల బాక్సింగ్ కోచ్‌గా జిల్లాకు చెందిన బాక్సర్ ఎత్తెసామొద్దీన్ నియమితులయ్యారు. ఈ నెల 30 నుంచి జూలై 7 వరకు కజకిస్తాన్‌లో జరిగే అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నీకి భారత మహిళల జట్టుతో వెళ్లనున్నారు. ఎత్తెసామొద్దీన్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి ఇండియన్ ఆర్మీలో చేరారు. హవల్దార్‌గా ఉద్యోగం చేస్తూనే అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నీలో పాల్గొనేవారు. పదోన్నతిపై సుబేదార్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ఎన్‌ఐఎస్ కోర్సు పూర్తి చేయడంతో భారత మహిళ బాక్సింగ్‌కు కోచ్‌గా నియమితులయ్యారు. ఎత్తెసామొద్దీన్ ఎంపికపై జిల్లాలోని బాక్సింగ్ క్రీడాకారులు, సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.



జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ మైదానంలో రైతు సమ్మేళన సభకు పసుపు రంగు చీరలు ధరించి హాజరైన మహిళలు



అభివాదం చేస్తున్న అమిత్ షా

రైతులంతా బీజేపీ వెంటే



తెలంగాణ రైతులంతా బీజేపీ వెంటే ఉన్నారు. పసుపు ప్రతిఒక్కరి జీవితంలో భాగమైంది. అలాంటి పసుపు పంటపై ఇక్కడి ప్రాంత రైతులు ఆధారపడి ఉన్నారు. కశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు నుంచి నక్సల్ ముక్త్ భారత్ వరకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో విజయాలు సాధించింది. తాజాగా ఉగ్రవాదులను అంతం చేయడంలో భారత్ చూపిన తెగువను ప్రపంచ దేశాలు అభినందిస్తున్నాయి. ఉగ్రవాదుల అంతం కోసం కేంద్రం చేస్తున్న కృషి ఎనలేనిది. పసుపు రైతులపై ప్రేమతోనే జిల్లా రైతు బిడ్డను జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా ఎంపిక చేశారు.

– అర్వింద్ ధర్మపురి, ఎంపీ



సభావేదిక వద్దకు వస్తున్న ప్రజలు

నిజామాబాద్ ఇక పసుపు రాజధాని

ప్రపంచదేశాలకు ఇక్కడి నుంచే ఎగుమతి

- పంటకు ప్రపంచవ్యాప్త గుర్తింపు
- పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించడం నా అదృష్టం
- రైతులకు ఇచ్చిన హామీని మోదీ నెరవేర్చారు
- జిల్లాలో రీసెర్చ్ సెంటర్లు..
- ఆర్గానిక్ పసుపు ఉత్పత్తి, మార్కెటింగ్‌కు ప్రభుత్వ కృషి
- రైతు సమ్మేళనంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

సుభాష్‌నగర్: నిజామాబాద్ పసుపు రాజధానిగా కాబోతోందని, ప్రపంచ దేశాలకు ఇక్కడి నుంచే పసుపు ఎగుమతి అవుతుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన రైతు సమ్మేళనం బహిరంగ సభకు అమిత్ షా ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అంతకుముందు కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తాలో మాజీమంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు డి శ్రీనివాస్ కాంస్య విగ్రహాన్ని అమిత్ షా ఆవిష్కరించారు. డీఎస్ గొప్ప రాజకీయ నాయకుడని, ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు.


రైతు సమ్మేళనంలో షా ప్రసంగం సాగిందిలా..



రైతు సమ్మేళన సభలో వేదికపై హోంమంత్రి అమిత్‌షా, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, అర్వింద్ తదితరులు

నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నానని అమిత్ షా అన్నారు. ఇందూరు రైతుల పోరాటం, ఎంపీ అర్వింద్ రైతులకు ఇచ్చిన హామీ మేరకు మోదీ ప్రభుత్వం పసుపు బోర్డు ఏర్పాటు చేసిందని తెలిపారు. బోర్డు ఏర్పాటుతో పసుపు రైతులకు మోదీ ఇచ్చిన హామీ నెరవేరిందన్నారు. బోర్డు ఏర్పాటుతో రాబోయే రెండుమూడేళ్లలో ఇందూరు పసుపునకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. ఏళ్లుగా రైతులు పసుపు సాగు చేస్తున్నా.. మార్కెట్‌లో అనుకున్న ధర, గుర్తింపు రాలేదని.. ఇక నుంచి ధర పెరుగుతూనే ఉంటుందన్నారు.

జిల్లాలో పసుపు రీసెర్చ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని, బోర్డు ద్వారా మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపరుస్తామని అమిత్ షా పేర్కొన్నారు. భారత్ ఆర్గానిక్ కో ఆపరేటీవ్ బ్రాంచ్‌ను, భారత్ కో ఆపరేటీవ్ ఎక్స్‌పోర్ట్ బ్రాంచీలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆర్గానిక్ పసుపు ఉత్పత్తి తోపాటు మార్కెటింగ్‌కు కేంద్రం కృషి చేస్తోందన్నారు. ఈ ఏడాది క్వింటాల్ పసుపు ధర రూ.19వేలు పలికిందని.. రానున్న మూడేళ్లలో రూ.7వేలు అదనం అవుతుందని పేర్కొన్నారు. రైతు బిడ్డ పల్లె గంగారెడ్డి జాతీయ పసుపు బోర్డు చైర్మన్ చేసి ఇక్కడి ప్రజలకు గుర్తింపు ఇచ్చామని అన్నారు. సభలో ఎంపీ ఈటల రాజేందర్, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె లక్ష్మణ్, ఎమ్మెల్సీలు కొమురయ్య, అంజిరెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్ రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి తదితరులు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

బీజేపీకి అధికారం ఇవ్వండి



రాష్ట్రంలో అందరికీ అవకాశం ఇచ్చారు.. బీజేపీకి ఒకసారి అధికారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా. జిల్లా ప్రజలు గొప్ప వారు.. కొట్లాడి పసుపు బోర్డును సాధించుకున్నారు. ఇందూరు రైతుల పోరాటం మామూలుది కాదు. జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటుతో ధర్మపురి అర్వింద్ కాస్త పసుపు అర్వింద్ అయ్యారు. రైతును రాజు చేయాలనేది గత నినాదం.. కానీ రైతును రారాజు, మహారాజు చేయాలనేది మోదీ సర్కారు నినాదం. పసుపు బోర్డు ఏర్పాటుకు కృషి చేసిన అమిత్ షాకు అందరం నిల్చొని చప్పట్లతో అభినందనలు తెలుపుతున్నాం. (సభాప్రాంగణంలోని వారంతా నిల్చుని చప్పట్లు కొట్టారు.)

– బండి సంజయ్, కేంద్ర సహాయమంత్రి

రైతు పక్షపాతి కేంద్ర ప్రభుత్వం



పసుపు బోర్డు కోసం ఏళ్లుగా పోరాటం చేస్తున్నారు. రైతు ఉద్యమాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డును ప్రకటించి వారి కలను సాకారం చేసింది. తెలంగాణతోపాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో పసుపు సాగవుతున్నా.. ఈ ప్రాంతంపై ఉన్న మమకారంతో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా నిజామాబాద్‌లో పసుపు బోర్డు కేంద్ర కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కేంద్రంరైతు పక్షపాతి. గతంలో విద్యుత్ కోతలతో పంటలు ఎండు ముఖం పట్టేవి. పదేళ్ల బీజేపీ పాలనలో విద్యుత్ కోతలు లేని భారత్ ను నిర్మించాం. సబ్సిడీపై ఎరువులు అందిస్తున్నాం. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని మోదీ ప్రారంభించారు. కిసాన్ సమ్మాన్ డబ్బులు ఇస్తు న్నారు. అయినా రైతాంగానికి మోదీ ఏం చేస్తున్నారని రేవంత్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారు. గతంలో కేసీఆర్ ఇలాగే ప్రశ్నించారు. యూపీఏ ప్రభుత్వం పసుపు బోర్డు ఎందుకు ఏర్పాటు చేయలేదు.

– కిషన్‌రెడ్డి, కేంద్ర బొగ్గుగనులశాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు



వేదికపై అమిత్ షాతో ముచ్చటిస్తున్న అర్వింద్



పసుపు రైతులతో అమిత్ షా

రేపే బాబ్లీ గేట్ల ఎత్తివేత

- నీరులేక వెలవెలబోతున్న ప్రాజెక్ట్
- వర్షాలు కురిస్తేనే వరద వచ్చేది..



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఎగువ భాగాన మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లను సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మంగళవారం ఎత్తడానికి ఇరు రాష్ట్రాల అధికారులు సిద్ధమవుతున్నారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్ సమీపంలో బాబ్లీ ప్రాజెక్ట్‌ను నిర్మించింది. సుప్రీం తీర్పు ప్రకారం ప్రతి సంవత్సరం జూలై 1వ తేదీన గేట్లను ఎత్తి, అక్టోబర్ 28న మూసి వేయాలి. అంతే కాకుండా మహారాష్ట్ర పరిసర ప్రాంతాల్లో నిలిచిన నీటికి బదులుగా మార్చి 1న బాబ్లీ గేట్లు ఎత్తి 0.6 టీఎంసీల నీటిని ఎస్సారెస్పీకి అందించాలని తీర్పులో పేర్కొన్నారు. గేట్ల ఎత్తివేత కార్యక్రమంలో ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్ గుప్తా, ఈఈ చక్రపాణి, అధికారులు పాల్గొననున్నారు.

ఎగువన ఖాళీనే...

బాబ్లీ ప్రాజెక్ట్‌తోపాటు దాని ఎగువన ఉన్న ప్రాజెక్ట్‌లు ప్రస్తుతం నీరు లేక వెలవెలబోతున్నాయి. ఒక్క బాలేగావ్ బ్యారేజీలో మాత్రమే 80 శాతం నీరు నిల్వ ఉంది. బాబ్లీ గేట్లు ఎత్తడంతో ఆ నీరు వచ్చే అవకాశం ఉండదు. దీంతో ఎస్సారెస్పీలోకి ఇప్పుడే వరద రాదని అధికారులు చెబుతున్నారు. బాబ్లీ ప్రాజెక్ట్‌లో 2 శాతం కూడా నీరు లేదని, విష్ణుపురి, గైక్వాడ్ ప్రాజెక్ట్‌లూ ఖాళీగానే దర్శనమిస్తున్నట్లు తెలిపారు. బాబ్లీకి ప్రధాన వరద నీరు అందించే అముదురా బ్యారేజీలో సైతం ప్రస్తుతం నీరు నిల్వ లేదు.

డీఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అమిత్‌షా

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తాలో మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ కాంస్య విగ్రహాన్ని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఆదివారం ఆవిష్కరించారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ రూ.44 లక్షల వ్యయంతో 14 అడుగుల డీఎస్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ అరివ్వింద్‌తోపాటు కుటుంబ సభ్యులు, రాజ్య సభ్యుడు లక్ష్మణ్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జాతీయ పసుపుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రతినిధుల నివాళులు

డీఎస్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో నుడా చైర్మన్ కేశవేణు, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, డీఎస్ సోదరుడు ధర్మపురి సురేందర్, మాజీ జెడ్పీటీసీ పుప్పాల శోభ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొని నివాళులర్పించారు. డీఎస్ అభిమానులు, నాయకులు విగ్రహం వద్ద సెల్ఫీలు తీసుకున్నారు.



డీఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం అభివాదం చేస్తున్న అమిత్ షా

మన విశ్వాసం.. సంప్రదాయం.. పసుపు

- ఇందూర్‌లో భారత్ ఆర్గానిక్ కో ఆపరేటీవ్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ బ్రాంచ్
- పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభం.. లోగో ఆవిష్కరణ సమావేశంలో అమిత్‌షా

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: భారతీయులకు శుభప్రదమైన పసుపు మసాలా కాదని.. మన విశ్వాసం, సంప్రదాయమని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. ఆదివారం నిజామాబాద్ నగరంలో పసుపు బోర్డు కార్యాలయాన్ని అమిత్ షా ఆదివారం ప్రారభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందూరు రైతుల పోరాటం గుర్తించి, రైతులకు ప్రధాని మోదీ ఇచ్చిన హామీ మేరకు బోర్డు ఏర్పాటు చేశామన్నారు. ఇదే జిల్లాకు చెందిన రైతుబిడ్డ పల్లె గంగారెడ్డికి చైర్మన్ పీఠం ఇచ్చామన్నారు. ఇందూరులో పసుపు బోర్డు ఏర్పాటుతో నగరానికి ప్రపంచ స్థాయి గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. మంగళదాయకమైన పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించే అవకాశం రావడం తన అదృష్టమన్నారు. యాంటీబయోటిక్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ వైరల్‌గా పనిచేసే పసుపును భారతీయులు వేల ఏళ్లుగా వంటల్లో వాడుతున్నారన్నారు. పాశ్చాత్యులు మాత్రం క్యాప్సుల్స్ రూపంలో తీసుకుంటున్నారన్నారు. బోర్డు ద్వారా రైతులే అంతర్జాతీయ ఎగుమతులు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం భారత్ కోఆపరేటీవ్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్, ఆర్గానిక్ పంటను ప్రోత్సహించేందుకు భారత్ ఆర్గానిక్ కో ఆపరేటీవ్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్ సంస్థలను నెలకొల్పిందని, నిజామాబాద్‌లో ఈ సంస్థల శాఖలను ఏర్పాటు చేస్తామన్నారు. 2030కల్లా అంతర్జాతీయ స్థాయిలో బిలియన్ డాలర్ల విలువ చేసే పసుపు ఉత్పత్తులను ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ధనసరి అనసూయ (సీతక్క), ఎంపీ ధర్మపురి అర్వింద్, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, పసుపు బోర్డు కార్యదర్శి భవానిశ్రీ, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి, కలెక్టర్ టి వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య, రాష్ట్ర కోఆపరేటీవ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, బాస వేణుగోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రిబ్బన్ కట్‌చేసి పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా

వన మహోత్సవం పనులు షురూ

- మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించిన ప్రభుత్వం
- జిల్లాలో ప్రారంభమైన పనులు
- గుంతలు తవ్వుతున్న ఉపాధిహామీ కూలీలు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో మొక్కలు నాటాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో త్వరగా మొక్కలు నాటించాలని సూచించింది. దీంతో గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖలు కదిలాయి. మొక్కలు నాటే పనుల ను ప్రారంభించాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలతో గుంతలను తవ్విస్తున్నారు. మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించి ఎస్టిమేషన్లు తయారు చేశారు. 11వ విడతలో గ్రామీణాభివృద్ధి శాఖ 28.87లక్షల మొక్కలు నాటాలని లక్ష్యాన్ని నిర్దేశించుకోగా, 530 నర్సరీల్లో 48లక్షల దాకా మొక్కలను పెంచింది. ప్రస్తుతం అవి నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే రోడ్లు, కాలువలు, చెరువు కట్టల వెంబడి గుంతలు తవ్వి మొక్కలు నాటుతున్నారు. ప్రభుత్వ స్థలాలు, కమ్యూనిటీ భవనాలు, పాఠశాలలు, ఇతర ప్రాంతాల్లో కూడా జూలై మొదటి నుంచి మొక్కలు నాటనున్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 2వేలకు పైగా మొక్కలు నాటాలని లక్ష్యం ఉంది. ఇంటికి ఐదు చొప్పున పూల మొక్కలను గ్రామ పంచాయతీల ద్వారా పంపిణీ చేయనున్నారు. ఇటు అటవీ శాఖ కూడా పోడు భూములు ఆక్రమణకు గురి కాకుండా మొక్కలు నాటాలని నిర్ణయించింది.



మారంపల్లిలో గుంతలు తవ్వుతున్న ఉపాధి హామీ కూలీలు

క్లుప్తంగా

పసుపు పంటకు మద్దతు ధర కావాలి

● బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌ రెడ్డి



నిజామాబాద్‌ అర్బన్‌: పసుపు రైతులకు కావాల్సింది తాత్కాలిక కార్యాలయాలు కాదని, పండించిన పసుపు పంటకు మద్దతు ధర కావాలని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌ రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రమంత్రి అమిత్‌ షా ప్రసంగంలో రాజకీయ అంశాలు తప్ప మద్దతు ధర, బోర్డుకు నిధుల విషయం, శాశ్వత భవన విషయాలు ఏవీ పేర్కొనకపోవడం సిగ్గుచేటన్నారు. పసుపు రైతులను మొదటి నుంచి బీజేపీ మాయమాటలతో మోసం చేస్తూ వస్తోందని అన్నారు. పసుపు బోర్డు కార్యక్రమానికి తనను, సురేశ్‌రెడ్డిని కానీ ఎవరూ ఆహ్వానించలేదన్నారు. గతంలో కేసీఆర్‌ నిర్మించిన రూరల్‌ ఎమ్మెల్యే క్యాంప్‌ కార్యాలయంలోనే కేంద్రం పసుపు బోర్డును ఏర్పాటు చేసిందన్నారు. బీఆర్‌ఎస్‌ పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌పై ఎవరైనా నిరాధార వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు.

డీవైఎస్‌వో హోదా కోసం సీనియర్‌ పీడీలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి(డీవైఎస్‌వో) హోదా కోసం పోటాపోటీగా ప్రయత్నాలు సాగుతున్నాయి. ప్రస్తుత డీవైఎస్‌వోగా విధులు నిర్వహిస్తున్న ముత్తెన్న నేటితో ఉద్యోగ విరమణ చేయనున్నారు. దీంతో సీనియర్‌ పీడీలు ఇప్పటికే అధికార పార్టీ నాయకులు, నేతలతో పైరవీలు చేస్తున్నారు. మరికొందరు మాత్రం అర్హత ఉంది ఎలాగైనా వస్తుందనే ధీమాలో ఉన్నారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం సీనియర్‌ పీడీలకు, ఇతర శాఖల అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయి. ఏది ఏమైనా కలెక్టర్‌ నిర్ణయమే ఫైనల్‌ కానుంది.

ఘనంగా బోనాల పండుగ



మోపాల్‌: మండలంలోని సిర్‌పూర్‌ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ముత్యాలమ్మ బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పంటలు బాగా పండాలని, ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని ప్రతి యేటా గ్రామంలో ముత్యాలమ్మ బోనాల పండుగ నిర్వహిస్తామని గ్రామ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌, పసుపు బోర్డు కార్యాలయాల వద్ద కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ఎంపీలు లక్ష్మణ్‌, బండి సంజయ్‌, కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య, ఎంపీ ధర్మపురి అర్వింద్‌, పసుపు బోర్డు చైర్మన్‌ పల్లె గంగారెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌ రావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, పసుపు బోర్డు కార్యదర్శి భవానీశ్రీ, నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ భూపతిరెడ్డి



పసుపు బోర్డు కార్యాలయంలో పూజలు చేస్తున్న అమిత్‌ షా



అమిత్‌ షాకు వినతిపత్రం అందజేస్తున్న మంత్రి తుమ్మల



పసుపు బోర్డు సమావేశంలో పాల్గొన్న రైతులు

అమిత్‌ షాకు ఘన స్వాగతం

నిజామాబాద్‌అర్బన్‌: నిజామాబాద్‌ నగర పర్యటనకు వచ్చిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌ షాకు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 2.15 గంటలకు నిజామాబాద్‌ కలెక్టరేట్‌ చేరుకున్నారు. అమిత్‌ షా వెంట కేంద్ర మంత్రి కిషన్‌ రెడ్డి రాగా, కేంద్రమంత్రి బండి సంజయ్‌, ఎంపీ అర్వింద్‌, అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ, పసుపు బోర్డు చైర్మన్‌ పల్లె గంగారెడ్డి, బీజేపీ జాతీయ నాయకులు కే లక్ష్మణ్‌, కలెక్టర్‌ టీ వినయ్‌ కృష్ణారెడ్డి, సీపీ సాయి చైతన్య తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక కాన్వాయ్‌లో కేంద్ర హోం మంత్రి వినాయక నగర్‌ చేరుకొని జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించారు. అక్కడి నుండి బస్వా గార్డెన్‌ చేరుకొని పసుపు బోర్డు ప్రారంభోత్సవ సమావేశంలో పసుపు రైతులు, అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌ అన్వేశ్‌ రెడ్డి, సహకార యూనియన్‌ లిమిటెడ్‌ చైర్మన్‌ మానాల మోహన్‌ రెడ్డి, అదనపు కలెక్టర్‌ కిరణ్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు. కేంద్ర హోం శాఖ మంత్రి పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా సీపీ సాయిచైతన్య పర్యవేక్షణలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.



అమిత్‌ షా చిత్రపటంతో అభిమాని



రైతు సమ్మేళనానికి హాజరైన అశేష జనవాహిని



అమిత్‌ షాకు కృష్ణుడి ప్రతిమను అందజేస్తున్న ఎంపీ అర్వింద్‌



బ్యాండు మేళాలతో సభకు వస్తున్న బీజేపీ శ్రేణులు



బోనాలతో సభకు వస్తున్న మహిళలు



జ్ఞాపికను అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

కేంద్ర హోంమంత్రి అమిత్‌ షా పర్యటన సైడ్‌లైట్స్‌..



సుభాష్‌నగర్‌: నిజామాబాద్‌ జిల్లా కేంద్రంలో పసుపు బోర్డు ప్రారంభోత్సవం, పీసీసీ మాజీ అధ్యక్షుడు డీ శ్రీనివాస్‌ విగ్రహావిష్కరణ, కిసాన్‌ సమ్మేళనం బహిరంగ సభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌ షా హాజరయ్యారు. ఆయన పర్యటన సైడ్‌లైట్స్‌..

- 2.30 గంటలకు జాతీయ పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభం.
- 2.45 గంటలకు బోర్డు కార్యాలయంలో పసుపు రైతులతో ముఖాముఖి, పసుపు పంట ఉత్పత్తుల ప్రదర్శనను తిలకించారు.
- 3.28 నగరంలోని కంఠేశ్వర్‌ బైపాస్‌లో మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు డీ శ్రీనివాస్‌ విగ్రహావిష్కరణ.
- 3.35 గంటలకు పాలిటెక్నిక్‌ కళాశాల మైదానంలో బహిరంగ సభ వేదికపైకి చేరుకున్నారు. వేదికపైకి రాగానే పసుపు రైతులు, ప్రజలకు అభివాదం చేశారు.
- 3.50 గంటలకు అమిత్‌ షా ప్రసంగం ప్రారంభించి, 18 నిమిషాల్లో ముగించారు.
- ప్రసంగం మధ్యలో పసుపు బోర్డు ప్రకటన, జిల్లా కేంద్రంలో జాతీయ కార్యాలయం ఏర్పాటుపై ప్రజలందరూ నిల్చొని కరతాళధ్వనులతో ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలపాలని కోరడంతో.. ప్రజలు, రైతులు ఆయనను అనుకరించారు.
- భారత్‌ మాతాకీ జై, వందేమాతరం, జై శ్రీరాం అంటూ అమిత్‌ షా తన ప్రసంగాన్ని ముగించారు.
- అనంతరం ఎంపీ అర్వింద్‌ ధర్మపురి శాలువా, జ్ఞాపికతో అమిత్‌ షాను సత్కరించారు.
- కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్‌ పేరు ప్రస్తావించినప్పుడల్లా ప్రజలు, రైతులు ఈలలు, కేకలు వేశారు.

ఎన్‌సీసీ విద్యార్థుల ప్లకార్డుల ప్రదర్శన

సుభాష్‌నగర్‌: రైతు సమ్మేళనంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌ షా ప్రసంగిస్తున్న సమయంలో ఒక్కసారిగా ఎన్‌సీసీ విద్యార్థులు నిల్చొని 'సేవ్‌ ఎన్‌సీసీ' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. నీట్‌లో ఎన్‌సీసీ కోటాలో ఒక శాతం ఉన్న రిజర్వేషన్‌ను తొలగించారని, వెంటనే తిరిగి రిజర్వేషన్‌ కల్పించాలని కోరారు. దీంతో వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని వారిని బయటికి పంపించారు. కాగా, ఎన్‌సీసీ విద్యార్థులు వరంగల్‌ నుంచి వచ్చినట్లు తెలిసింది.



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

షుగర్‌ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలి

● కేంద్ర మంత్రి అమిత్‌ షాకు రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి వినతి

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): నగర శివారులోని సారంగాపూర్‌ షుగర్‌ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ ఆర్‌ భూపతి రెడ్డి కేంద్ర హోంశాఖ, సహకార మంత్రి అమిత్‌ షాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో నిజామాబాద్‌కో ఆపరేటివ్‌ షుగర్‌ ఫ్యాక్టరీ లిమిటెడ్‌ మాత్రమే సహకార రంగంలో ఉన్న కార్మాగారమని తెలిపారు. 1958లో స్థాపించగా, 1962 నుంచి ఫ్యాక్టరీ ప్రారంభమైందని అమిత్‌ షాకు వివరించారు. 126 గ్రామాల నుంచి 23,216 మంది వాటాదారులను కలిగి ఉందని, 2005లో మూతపడిందని పేర్కొన్నారు. సారంగాపూర్‌ వద్ద 92.12 ఎకరాల విస్తీర్ణంలో, విద్యుత్‌శక్తి, నీరు, రహదారి, రైలు కనెక్టివిటీ వంటి అన్ని మౌలిక సదుపాయాలను కలిగి ఉందని అమిత్‌ షా దృష్టికి తీసుకొచ్చారు. ఫ్యాక్టరీ మూతపడటంతో సుమారు 200 ఎకరాల్లో రైతులు పండిస్తున్న చెరుకును 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న కామారెడ్డి గాయత్రీ షుగర్స్‌కు సరఫరా చేస్తున్నారని తెలిపారు. కో ఆపరేటివ్‌ సహకార పరిశ్రమలను పునరుద్ధరించడానికి కేంద్రం రూ.3వేల కోట్లను ప్రకటించినట్లు గుర్తు చేశారు. సారంగాపూర్‌ ఫ్యాక్టరీ పునరుజ్జీవంతో జిల్లా వ్యవసాయ ఉత్పత్తికి కేంద్రంగా మారుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



అమిత్‌ షాకు వినతిపత్రం అందిస్తున్న భూపతిరెడ్డి

ఫుడ్‌ ప్రాసెసింగ్‌ యూనిట్‌ ఏర్పాటు చేయాలి

డిచ్‌పల్లి: జిల్లాలోని నందిపేట్‌ మండలం లక్కంపల్లి గ్రామంలో ఉన్న 200 ఎకరాల భూమిలో ఫుడ్‌ ప్రాసెసింగ్‌ యూనిట్‌ ఏర్పాటు చేయాలని రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు వినతిపత్రం అందజేశారు. లక్కంపల్లి సెజ్‌లో ఫుడ్‌ ప్రాసెసింగ్‌ జోన్‌ ఏర్పాటుకు ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కార్పొరేషన్‌ (ఏపీఐఐసీ) ద్వారా భూములు కొనుగోలు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయ ఉత్పత్తులకు కేంద్రంగా మారిందని, వరి, పసుపు ఏదైనా ఫుడ్‌ ప్రాసెసింగ్‌ యూనిట్‌ను స్థాపించడంతో ఈ ప్రాంత అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు.

అమిత్‌ షా పర్యటనలో కొరవడిన సమన్వయం

● ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల ఆహ్వానంలో రాజకీయం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: నిజామాబాద్‌లో ఆదివారం బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటన నేపథ్యంలో రాష్ట్ర పార్టీలో సమన్వయం కొరవడింది. బహిరంగ సభకు రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను రాష్ట్ర పార్టీ ద్వారా ఆహ్వానించాల్సి ఉన్నప్పటికీ అదీ జరుగలేదు. పైగా అనుమతి లేదని చెప్పడంతో ఎంపీలు డీకే అరుణ, రఘునందన్‌రావు, గోడం నగేశ్‌, కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలు హాజరుకావాల్సి ఉన్నప్పటికీ రాలేని పరిస్థితి సృష్టించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈటల రాజేందర్‌కు సైతం చివరి నిమిషంలో పిలుపు వెళ్లినట్లు సమాచారం. అదేవిధంగా 8 మంది ఎమ్మెల్యేలకు ఐదుగురు రాలేదు. ఉమ్మడి జిల్లాకు చెందిన కామారెడ్డి ఎమ్మెల్యేకు సైతం ఆహ్వానం లేకపోవడం గమనార్హం. మరోవైపు ఆర్మూర్‌ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి పేరు సైతం లేకపోవడంతో చివరి నిమిషంలో ఎంపీ అర్వింద్‌ పట్టుబట్టి నమోదు చేయడం గమనార్హం. అమిత్‌ షా నిజామాబాద్‌ పర్యటన నేపథ్యంలో, బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నిక సమయంలో అర్వింద్‌పై అసంతృప్తిని రగిల్చేందుకే కొందరు కీలక నేతలు ఈ రాజకీయం చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

క్రైం కార్నర్‌

డివైడర్‌ను ఢీకొన్న బైక్‌.. ఒకరి మృతి



భిక్కనూరు/సదాశివనగర్‌: సదాశివనగర్‌ మండలం కల్వరాల సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన బత్తుల రాంచంద్రం (48) మృతి చెందాడు. రాంచంద్రం నిజామాబాద్‌లోని తన కుమార్తె ఇంటికి బోనాల పండుగకు వెళ్లి తిరిగి భిక్కనూరుకు వస్తుండగా కల్వరాల వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో రాంచంద్రం అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్‌ తెలిపారు.

పశువుల కాపరి మృతదేహం లభ్యం

మాక్లూర్‌: చెరువులోకి చొరబడిన గేదెలను బయటకు తీసే క్రమంలో శనివారం సాయంత్రం గుత్ప చెరువులో ప్రమాదవశాత్తు మునిగి గల్లంతైన పశువుల కాపరి బాబన్న (60) మృతదేహం ఆదివారం లభించింది. మాక్లూర్‌ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.. గుత్ప గ్రామానికి చెందిన బాబన్న అతని భార్య కలిసి గ్రామస్తులందరి గేదెలను కూలీ లెక్కన మేపుతారు. రోజూ మాదిరిగానే శనివారం సాయంత్రం గేదెలను గ్రామంలోనికి తెచ్చే ముందు నీరు తాగించేందుకు సమీపంలో ఉన్న చెరువులోనికి దించాడు. అవి ఎంతకూ బయటికి రాకపోవటంతో బాబన్న చెరువులోనికి దిగి వాటిని బయటకు తీసే క్రమంలో మునిగిపోయాడు. సమాచారం తెలుసుకున్న మాక్లూర్‌ పోలీసులు శనివారం సాయంత్రం గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా ఆదివారం సాయంత్రం బాబన్న శవం లభ్యమైంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లైన్‌మన్‌పై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

రెంజల్‌(బోధన్‌): విద్యుత్‌ బిల్లుల వసూళ్లకు వెళ్లిన తనపై ఇద్దరు వ్యక్తులు దాడి చేశారని రెంజల్‌ లైన్‌మన్‌ శ్రీనివాస్‌ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారులు ఆదేశాల మేరకు సాటాపూర్‌ గ్రామంలో కరెంట్‌ బిల్లులను వసూలు చేసేందుకు వెళ్లగా గ్రామానికి చెందిన మన్మథ స్వామి, మన్మథ మహేశ్‌ అనే వ్యక్తులు దురుసుగా మాట్లాడుతూ చేయి చేసుకున్నారని పేర్కొన్నారు. రెంజల్‌ శివారులోని వారి పొలంలో అక్రమంగా స్తంభాలు ఏర్పాటు చేసుకొని విద్యుత్‌ను వినియోగిస్తుండటంతో ఏఈ ఆదేశాల మేరకు కరెంట్‌ కనెక్షన్‌ తొలగించినట్లు తెలిపారు. దానిని దృష్టిలో పెట్టుకొని తనపై దాడి చేసి గాయపర్చారని పేర్కొన్నారు.

పొలంలోకి దూసుకెళ్లిన కారు



బోధన్‌: పట్టణ శివారు నుంచి రాయ్‌కూర్‌ గ్రామానికి వెళ్లే మార్గంలో ఆదివారం స్థానిక కర్నె రాజశేఖర్‌ అనే రైతు వరి నాటు వేసిన పొలంలోకి కారు దూసుకెళ్లిందని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ఏడుగురు వ్యక్తులు ఆకతాయి చేష్టలు చేస్తూ అతివేగంగా, అజాగ్రత్తగా డ్రైవింగ్‌ చేయడంతో కారు పంట పొలంలోకి దూసుకెళ్లిందని పేర్కొన్నారు. వరి పంటకు నష్టం జరిగిందని రైతు ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించి వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.

అధ్వానంగా టూరిజం రోడ్డు

● ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌కు వాహనాల్లో వెళ్లలేని పరిస్థితి

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): టూరిజం స్పాట్‌గా మారిన ఎస్సారెస్పీ బ్యాక్‌ వాటర్‌ ప్రాంతానికి వెళ్లేందుకు పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు డొంకేశ్వర్‌ మండలం చిన్నయానం వద్ద మట్టి రోడ్డు బురదమయంగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ద్విచక్ర వాహనాలు అదుపు తప్పుతున్నాయి. గుంతలు ఏర్పడడంతో రోడ్డుపై కార్లు నడపడం కూడా కష్టంగా మారింది. టూరిజం చూడాలంటే ఇదే ప్రధాన దారి కావడంతో వాహనాలు అధిక సంఖ్యలో వస్తున్నాయి. అధికారులు స్పందించి బీటీ రోడ్డు వేయాలని సందర్శకులు, స్థానికులు కోరుతున్నారు.



బురదమయంగా మారిన బ్యాక్‌ వాటర్‌ ప్రాంతానికి వెళ్లే మట్టి రోడ్డు

భీమ్‌గల్‌కు కోర్టు మంజూరు

● ఉత్తర్వులు జారీ

మోర్తాడ్‌/ఆర్మూర్‌: భీమ్‌గల్‌ కేంద్రంగా జూనియర్‌ సివిల్‌ జడ్జి కమ్‌ ఫస్ట్‌ క్లాస్‌ జుడీషియల్‌ మెజిస్ట్రేట్‌ కోర్టు ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు కొత్త కోర్టులను మంజూరు చేస్తూ ప్రభుత్వ న్యాయ వ్యవహారాలు, శాసన వ్యవహారాలు, న్యాయ కార్యదర్శి ఆర్‌.తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. భీమ్‌గల్‌లో కోర్టును ప్రారంభించాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఇది వరకు భీమ్‌గల్‌ సర్కిల్‌ పరిధిలోని నాలుగు పోలీసు స్టేషన్‌లకు సంబంధించిన కేసుల కోసం ఆర్మూర్‌ కోర్టుకు వెళ్లేవారు. గతంలో భీమ్‌గల్‌ సర్కిల్‌లో కొనసాగిన సిరికొండ మండలం కూడా ఆర్మూర్‌ కోర్టు పరిధిలో ఉంది. భీమ్‌గల్‌లో కోర్టు ప్రారంభమైన తర్వాత మోర్తాడ్‌, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్‌, ఏర్గట్ల పోలీసు స్టేషన్‌ల పరిధిలోని కేసులకు సంబంధించి ఇక్కడే విచారణ జరుగనుంది. సిరికొండ మండలం పరిధిలోని కేసులు కూడా భీమ్‌గల్‌ కోర్టు పరిధిలోకి వచ్చే అవకాశం ఉందని సీనియర్‌ న్యాయవాదులు చెబుతున్నారు. దశాబ్దాల కాలంగా భీమ్‌గల్‌లో కోర్టు ఏర్పాటు చేయాలనే విన్నపం ఉంది. కొత్త కోర్టుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం, అందులో భీమ్‌గల్‌కు కోర్టు మంజూరు కావడం విశేషం.

ప్రజల విజయం



కేసుల సత్వర పరిష్కారం కోసం భీమ్‌గల్‌ కేంద్రంగా జుడీషియల్‌ ఫస్ట్‌క్లాస్‌ కోర్టు మంజూరు చేయాలని కోరుతూ వచ్చాం. కోర్టు మంజూరుతో ఆరు మండలాల పరిధిలో త్వరితగతిన కేసులు పరిష్కారమవుతాయి. – గజ్జెల చైతన్య, న్యాయవాది, భీమ్‌గల్‌

ఇక్కట్లు తీరుతాయి..




భీమ్‌గల్‌ కేంద్రంగా కోర్టు ఏర్పాటుకు అన్ని అర్హతలు ఉన్నాయి. 2009–10 లో భీమ్‌గల్‌కు మంజూరైన కోర్టు ఆర్మూర్‌కు మారింది. అప్పటి నుంచి న్యాయవాదులు, ప్రజలు కలిసి విన్నవించాం. కక్షిదారుల ఇక్కట్లు తీరుతాయి. – సురేశ్‌, న్యాయవాది, భీమ్‌గల్‌

మృతదేహాన్ని తెప్పించేందుకు సీఎంవో చర్యలు

నిజామాబాద్‌అర్బన్‌: వేల్పూర్‌ మండలం పచ్చలనడ్కుడ గ్రామానికి చెందిన గోజ కిషన్‌(61) సౌదీ అరేబియాలో ఈ నెల 25న మరణించారు. దీంతో మృతదేహాన్ని త్వరగా తెప్పించాలని మృతుడి భార్య జమున సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించారు. స్పందించిన సీఎంవో కార్యాలయం మృతదేహాన్ని తీసుకువచ్చే చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ జీఏడీ ఎన్నారై విభాగం అధికారులు ఇటీవల ఢిల్లీలోని విదేశాంగ శాఖకు, సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని ఇండియన్‌ ఎంబసీకి 'మదద్‌' పోర్టల్‌ ద్వారా విజ్ఞప్తి చేశారు. మృతదేహాన్ని త్వరగా భారత్‌కు తరలించేందుకు అవసరమైన సహకారాన్ని కోరారు. ఈ విషయంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌ అన్వేశ్‌ రెడ్డి చొరవ చూపగా రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్‌ చైర్మన్‌ మంద భీమ్‌రెడ్డి సహకరించారు.

ఆడుకుంటూ అనంతలోకాలకు..

● కారు ఢీకొని బాలుడి మృతి



ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఆడుకుంటున్న బాలుడిపై నుంచి కారు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ముజాహిద్‌నగర్‌కు చెందిన ఖయ్యూం (7) ఆదివారం రోడ్డుపై పిల్లలతో కలిసి ఆడుకుంటున్నాడు. కాలనీలోనుంచి వస్తున్న కారు క్రాసింగ్‌ చేస్తూ ఖయ్యూం పైనుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. రోడ్డు ప్రమాదానికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీ సోషల్‌ మీడియాలో వైరల్‌ అవుతోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.